క్లుప్తంగా

కరపత్రాల విడుదల



నారాయణపేట రూరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మొల్గాన్ జనార్దన్ తెలిపారు. సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేసి మాట్లాడారు. ప్రముఖ జనరల్ ఫిజీషియన్ గందె కార్తీక్ ఆధ్వర్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ఎండ్రోక్రైనలాజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలవేణితో పాటు స్థానిక వైద్యులు శిబిరంలో పాల్గొంటారని వివరించారు. క్లబ్ సెక్రెటరీ సాయినాథ్, ట్రెజరర్ రవి కుమార్‌గౌడ్, నర్సింహులు, సదానందచారీ పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

దామరగిద్ద: బీసీ కులవృత్తుల వారికి రూ. లక్ష సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తు చేసుకొనేందుకు అవసరమైన ధ్రువపత్రాలను పొందడం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. పెద్దసంఖ్యలో కుల, ఆదాయ, స్థానికత తదితర ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దామరగిద్ద తహసీల్దార్ కార్యాలయానికి 500లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సిబ్బంది మంగళవారం తెలిపారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

నారాయణపేట: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహాయం అందించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో మంగళవారం పర్యటించి రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. రోడ్ల పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయినేజీల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపాలిటీ సిబ్బందిని, కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్లపై ఇంటి నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. సామగ్రి రోడ్లపై వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీఓ కిరణ్‌కు సూచించారు. కమిషనర్ సునీత, సిబ్బంది ఉన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

నారాయణపేట రూరల్: జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను వాడుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ఆర్టీఓతో కలిసి సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటేష్, భరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

నర్వ: పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవిశ్వాస తీర్మాణానికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేకున్నా ఆయనపై నిందలు వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్ ఎంపీపీ వీణావతి, మహేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, పల్లెశేఖర్, లింగన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు అవార్డు అందజేత



కృష్ణా: తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆలంపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రాఘుసుధకు మంగళవారం ఉత్తమ మహిళా ఉద్యోగిగా గుర్తించి అవార్డు ప్రదానం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ, ఎంపీపీ పూర్ణిమ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ రాఘుసుధను అభినందించారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి

కోయిల్‌కొండ: హరితహారంలో భాగంగా గ్రామాలలో ఏర్పాటుచేసిన వన నర్సరీల్లో సూచించిన మేరకు మొక్కలను సమయానికల్లా సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సూరారం నర్సరీలో మొక్కలను మంగళవారం పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. అడిగిన ప్రతికూలీకి పనికల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

- జీఎస్‌బీ మెటల్‌తో నిలిచిన పనులు
- దుమ్ము లేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఏడు నెలలు గడిచిన పూర్తిచేయని అధికారులు



వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తున్న రోడ్డు

దామరగిద్ద: మండల కేంద్రంలో అసంపూర్తి రోడ్డు పనులతో ఓ వైపు స్థానికులు. మరో వైపు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బాధ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. మండల కేంద్రంలోని సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ ఇన్నాళ్లు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను గత నవంబర్‌లో ప్రారంభించారు. ఇటీవల జీఎస్‌బీ మెటల్ నిర్మాణం పూర్తి చేసి వదిలేశారు. రోడ్డుకు నీరు పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దుమ్ము లేచి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. భరించలేక స్థానికులు కొందరు స్వంతగా రోడ్డుకు నీరుపడుతున్నారు. ఇదిలా ఉంటే సైడ్ డ్రెయిన్ నిర్మాణమూ చేపట్టక పోవడంతో రోడ్డు పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఏడేళ్ల కిత్రం దామరగిద్ద– యానగుంది వరకు 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి 13 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. కాగా ఇందులో భాగంగా దామరగిద్ద గ్రామంలో మినహా మిగిలిన 10.08 కిలోమీటర్ల రోడ్డు పూర్తి చేశారు. దామరగద్దలో సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డు ఇన్నాళ్లు పెండింగ్‌లో ఉంచారు. కాగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చొరవతో ఏడు నెలల క్రితం ప్రారంభించారు. కానీ ఇప్పటికీ పూర్తిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. అసంపూర్తి పనులతో ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా పూర్తిచేయాలని కోరుతున్నారు.



దుమ్మురాకుండా రోడ్డుకు నీటిని పడుతున్న స్థానికుడు

త్వరలోనే పూర్తిచేస్తాం..



వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రేడర్ యంత్రాన్ని మరమ్మతు చేయించేందుకు కాంట్రాక్టర్ హైదరాబాద్ తీసుకువెళ్లారు. మరమ్మతు పూర్తిగా మిగిలిన జీఎస్‌బీ మెటల్ పనులతో పాటు, బీటీరోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం. అప్పటి వరకు వాటర్ క్యూరింగ్ చర్యలు చేపట్టి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుంటాం.

– రాములు,
డీఈ, ఆర్అండ్‌బీ, నారాయణపేట

చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని క్రీడా మైదానాన్ని అక్రమంగా కొందరు ఆక్రమించి అధికార పార్టీ నాయకులకు రాసి ఇస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు సర్వే చేసి ఇప్పటివరకు రిపోర్టును బయట పెట్టలేదన్నారు. కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో రిపోర్టును దాచి, కబ్జాకు పాల్పడ్డారని అన్నారు. సేవ్ ధన్వాడ క్రీడా మైదానం పేరుతో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామన్నారు. మండల అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి మొగులయ్య, వెంకట్‌రాములు, తిమ్మరాజు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికా బద్ధంగా విధులు నిర్వహించాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఉపాధ్యాయుడు ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సింగారం క్రాస్‌రోడ్డులోని స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో మంగళవారం దామరగిద్ద, కృష్ణ, ధన్వాడ మండల టీచర్లకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు చెప్పే ప్రతీ విషయం టీచర్ ముందుగా పాటించాలని, స్కూల్‌కి ఆలస్యంగా రావడాన్ని సహించబోమని అన్నారు. రోజువారి ప్రణాళికతో విద్యాబోధన జరగాలని, సమయానికి పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠ్యాంశ బోధనకు టీఎల్‌ఎం ఉపయోగించాలని సూచించారు. 20న జరిగే విద్యా దినోత్సవం విజయవంతంగా చేపట్టాలని సూచించారు.

పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలి..

స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం జిల్లాలోని విద్యాశాఖ పరిధిలో ఉన్న 33 క్లస్టర్ల ఇన్‌చార్జ్‌లు, సీఆర్పీలతో కలెక్టర్ సమావేశమయ్యారు. పాఠశాలల పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిత్తల్, డీఈఓ రవిందర్, ఏఎంఓ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతం



మాట్లాడుతున్న ఏఈఓ వినోద్

కోస్గి: పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతం అవుతాయని పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి వినోద్ సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో రైతులకు పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ భూముల్లో సారవంతం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతియేటా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగా విత్తనాలను రైతులకు రాయితీపై అందిస్తుందన్నారు. రైతులు జీలుగా విత్తనాలు వేసుకొని పూత దశలో పొలంలోనే కలియదున్నడం ద్వారా భూములు సారవంతమవుతాయన్నారు. అదే విధంగా పాం ఆయిల్ తోటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. పాం ఆయిల్ తోటలకు సంబంధించిన రాయితీలు, ఇతర సాగు విధానాన్ని సమగ్రంగా వివరించారు. కొత్తగా భూమి పాస్ బుక్కులు పొందిన వారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో గ్రామ రైతులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



మరికల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

మరికల్: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి అకాల మరణం తీరని లోటని అఖిల పక్షం నాయకులు శేఖర్, హరీష్, మల్లయ్య తదితరులు అన్నారు. మరికల్ చౌరస్తాలో మంగళవారం దయాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. కొండయ్య, రవి, రజినికాంత్, ఉస్సేన్, వెంకటేష్, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.

ధన్వాడ: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డికి మంగళవారం ధన్వాడ మండల కేంద్రంలో మాజీ టీడీపీ నాయకులు, అఖిలపక్ష నాయకులు నివాళి అర్పించారు. బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. సర్పంచ్ అమరేందర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

కోస్గి: మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మరణం టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు అన్నారు. మంగళవారం స్థానిక శివాజీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు కుమ్మరి అంజిలయ్య, నాయకులు అచ్యుతారెడ్డి, అమృత్‌రెడ్డి, సాయిరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

నర్వ: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి మృతిపై మంగళవారం మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు, అభిమానులు ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం ఎదుట దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. నాయకులు కురుమారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, రఫీ, వెంకట్రామారెడ్డి, ఖాజా,మారెప్ప, డీలర్ హన్మంతు, సుధీర్, జగదీష్,, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి మృతి బాధాకరమని టీడీపీ నాయకులు వడ్వాట్ రవీంధర్, నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా దగ్గర ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిస్వార్ధంగా ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు దయాకర్‌రెడ్డి అని కొనియాడారు. నాయకులు నరేష్, వేణు, అంజనేయులు, శివ, మహేష్, మహదేవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి మంగళవారం మృతి చెందాడు. నియోజకవర్గానికి చెందిన నాయకులు పర్కాపూర్‌కు వెళ్లి దయాకర్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ట్రేడ్ స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, నారాయణపేట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, జలంధర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పోచమ్మకు బోనాలు

మరికల్: కన్మనూర్‌లో మంగళవారం ఘనంగా పోచమ్మ బోనాల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా అమ్మవారి వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత



మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి గ్రామానికి చెందిన గుడిసె నర్సిములు ఇటీవల పాముకాటుతో మృతి చెందాడు. దీంతో ప్రమాద బీమా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం ఏపీజీవీబీ రీజినల్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ సుభాష్, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నామినీ పార్వతమ్మకు చెక్కును అందజేశారు. ఖాతాదారులు బ్యాంకు సేవలతోపాటుగా తప్పకుండా ప్రమాదబీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని ఎద్లాపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమ్మవ్వను దర్శించుకున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టింది. దీంతో ఎల్లప్పకు తీవ్రగాయాలు కాగా, బసవలింగలకు స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం రాయచూర్‌కు తరలించారు.

విస్తరిస్తున్న విషజ్వరాలు

అమరచింత: పట్టణంలో మళ్లీ డెంగీ జ్వరం పంజా విసురుతోంది. పట్టణానికి చెందిన రెండేళ్ల చక్రపాణి అనే బాలుడికి డెంగ్యూ జ్వరం ఉందని వైద్యాధికారులు వెల్లడించడంతో సోమవారం ఆరోగ్య సిబ్బంది పరిసరాల్లో బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. మరి కొద్ది రోజుల్లో వర్షాలు కురవనున్న నేపథ్యంలో మురుగుకాల్వలతో పాటు కాలనీ పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదో వార్డులో నివాసం ఉంటున్న తెలుగు రమేష్ రెండేళ్ల కుమారుడు చక్రపాణి జ్వరంతో వారం రోజులుగా బాధపడుతుండటంతో తల్లిదండ్రులు పాలమూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా బాలుడికి డెంగీ జ్వరం అని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఎనిమిదో వార్డుతో పాటు ఒకటో వార్డులోని ఆయా వీధుల్లో మురుగుకాల్వ దుస్థితి అధ్వాన్నంగా ఉందని, పందులు విపరీతంగా సంచరిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని పట్టణ శివారు ప్రాంతాలకు తరలించకుండా చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు.

కోడూర్‌ను సందర్శించిన కేంద్ర బృందం

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్ గ్రామాన్ని మంగళవారం కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ పొసామిబసు అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామ సమీపంలోని ముక్కిరిగట్టు ప్రాంతంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్వహిస్తున్న పనులను బృందం సభ్యులు పరిశీలించి ఈజీఎస్ సిబ్బందితోనూ, కూలీలతోనూ మాట్లాడారు. కందకాల నిర్మాణానికి ముందు తర్వాత వచ్చిన మార్పులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చెరువులు, హరితహారం మొక్కలు, గ్రామంలో పలు అభివృద్ధి పనులు తదితర విషయాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ యాదయ్య, ఏపీడీలు జకియాసుల్తానా, శ్రీపాదరావు, ఎంపీడీఓ జ్యోతి, సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, ఏపీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ అమ్జద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఏపీఓ అమ్జద్, ఈసీ ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: మహిళల అభ్యున్నతే లక్ష్యమని జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో రవి కన్వెన్షన్ హాల్‌లో ఐసీడీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. స్త్రీనిధి నుంచి మంజూరైన రూ.8 కోట్ల నిధులను మహిళా సంఘాలకు అందజేశారు. అనంతనం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లకు, మహిళ అధికారులకు ఉత్తమ అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, జెడ్పీటీసీలు అశోక్‌గౌడ్, వెంకటయ్య, గౌని జ్యోతి, ఎంపీపీలు వనజ, శ్యామలమ్మ, ఎల్కోటి లక్ష్మి, పూర్ణిమ పాటిల్, సీడీపీఓ సరోజిని, జెడ్పీ సీఈఓ జ్యోతి, కమిషనర్ పావని, ఉపాధ్యక్షురాలు రామేశ్వరి, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని, సూపర్‌వైజర్లు అరుణ, రాజేశ్వరి, మహేశ్వరి, అమ్మక్క, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

మరికల్: ప్రభుత్వం ప్రకటించిన దళితబంధు పథకం అర్హులందరికీ వర్తింపజేయాలని జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు కృష్ణ అన్నారు. మరికల్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌ను గద్దె దించే సమయం వచ్చిందన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీలో ఉండే దళిత నాయకులకే పథకాలు అందితే మిగిత వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే దళితులపై ప్రేమ చూపడం, ఆతర్వాత విస్మరించడం కేసీఆర్‌కు కొత్తమీ కాదన్నారు. రాష్ట్ర ఎస్సీమోర్చా కార్యవర్గ సభ్యులు కొండయ్య, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నర్సిములు, వేణుగోపాల్, హన్మంతు, చెన్నయ్య పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డుతో ఇబ్బందులు



పాతపల్లి రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ధన్వాడ: మండల కేంద్రం నుంచి పాతపల్లి గ్రామానికి ఉన్న రోడ్డు కంకరతేలి నిత్యం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, గ్రామ ప్రజలు మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని వాపోయారు. రోడ్డు సరిగా లేకపోవడంతో బస్సులు, ప్రైవేట్ వాహనాలు రావడం లేదని దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే స్పందించి రోడ్డు వేయాలని కోరారు. పీడీఎస్‌యూ గ్రామ కార్యదర్శి నరేష్, రాజేష్, కుజరత్‌అలీ, బాలు, కురుమూర్తి, శివకుమార్, మహేష్, అంజి, శరత్, నవీన్, రాజు, నర్సింహులు, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

మూడు మండలాలు ప్రకటించాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సలీం

నారాయణపేట రూరల్: నియోజకవర్గంలో అర్హత కల్గిన మూడు గ్రామాలను మండలాలుగా ప్రకటించాలని పీవైఎల్ నాయకులు సలీం డిమాండ్ చేశారు. కోటకొండ గ్రామంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 35వ రోజుకు చేరుకోగా మంగళవారం మహిళలు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో కోటకొండతో పాటు కాన్‌కుర్తి, గార్లపహాడ్‌లను కొత్త మండలాలుగా గుర్తించే విధంగా స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని, సీఎం కేసీఆర్‌ను ఒప్పించి వెంటనే ప్రకటన ఇప్పించాలన్నారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌లను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, రాము, అనసూయ, బలరాం, కాశీనాథ్, చెన్నప్ప, విజయలక్ష్మి, నర్సింహులు, యాదగిరి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



ఊట్కూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ వెంకటయ్య సూచించారు. మంగళవారం నిడుగుర్తిలో ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటప్ప, సుజాత, సలాం, సునీత పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టులో మంగళవారం ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి గోవా నుంచి ఎనిమిది బాటిళ్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడు. ఎక్సైజ్ ఎస్ఐ కవిత, శ్రీనివాస్‌గౌడ్‌లు గోవా మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీసులు మల్లన్‌గౌడ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోయిల్‌కొండ: మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపెద్దరాజు, అనంతమ్మలు వారం రోజుల క్రితం భవానీసాగర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి ముగ్గురు కూమార్తెలు అనాథలుగా మారారు. దీంతో అదే గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చెల్లాపురం శ్రీనివాస్‌రెడ్డి తనవంతుగా రూ.11వేలు అందించారు. ఆయన వెంట సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో కార్మికశాఖ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన కార్మికులకు మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీతో రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వర్, ఆస్పత్రి సిబ్బంది ఫయాజ్, బాబు, కనకారాయుడు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్నిస్తున్న రైతులు

మరికల్: మండలంలో అధిక సంఖ్యలో భూ సమస్యలు ఉన్నందున్న రెగ్యులార్ సర్వేయర్‌ను నియమించి సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు మంగళవారం తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రాన్నిచ్చారు. రెండు మండలాలకు కలిపి ఒక సర్వేయర్‌ను నియమించడం వల్ల భూసమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఏడాది నుంచి సర్వేయర్ చుట్టూ తిరిగితే, ఎట్టాకేలకు వచ్చి పక్క పొల్లాల మధ్యన చిచ్చు పెట్టేలా చేసి అసంతృప్తిగా వదిలేశాడని మండిపడ్డారు. మండలానికి వెంటనే రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని అన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు వెంకట్రాములు, ఆంజనేయులు, శ్రీరాములు, ఆశమ్మ, అనంతమ్మ, కమల్, నర్సిములు పాల్గొన్నారు.